# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-04-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **హార్టికల్చర్‌లో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **నీటి భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.**

3. **రాష్ట్రంలో రహదారులు, భవనాల శాఖ ద్వారా కోట్ల రూపాయల విలువ చేసే వివిధ రకాల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి తెలిపారు.**

4. **గోదావరి మహా పుష్కరాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఉమ్మడి కార్యాచరణ బృందాలు ఏర్పాటు చేసుకోవాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా సూచించారు.**

==========================

రాయలసీమను రతనాల సీమగా మార్చుతున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికిలో 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమాన్ని ఈరోజు ముఖ్యమంత్రి ప్రారంభించారు. అంతకుముందు వంద రోజుల యాక్షన్ ప్లానులో భాగంగా నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత పేరుతో యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. నీరు అందరికీ అవసరమని, దానిని సంరక్షించుకోవడానికి వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టినట్లు చెప్పారు. హార్టికల్చర్‌లో దేశంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలియజేస్తూ..

వాయిస్..30..సెకన్లు

---

నీటి భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలోని మూల పేట పోర్టు నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ కాలనీలను మంత్రి ఈరోజు సందర్శించారు. ముందుగా 'నీటి భద్రత సాగు నీటి సంఘాల బాధ్యత' కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్షపు నీటిని వృథా కాకుండా నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాలు పెంచాలని, చెరువులు నింపాలని సూచించారు. రాష్ట్రంలోని 60 వేల నీటి సంఘాలు, వంద

రోజుల వ్యవధిలో క్షేత్ర స్థాయిలో పర్యటించి భూగర్భ జలాలు పెరిగే అవకాశాలు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని మంత్రి పిలుపునిచ్చారు.

---------------------------

రాష్ట్రంలో రహదారులు,భవనాల శాఖ ద్వారా కోట్ల రూపాయల విలువ చేసే అనేక రకాల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా ఆయన ఈరోజు అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఒకే సంవత్సరంలో మూడు వేల కోట్ల రూపాయల వ్యయంతో మూడు వేల కిలో మీటర్ల పొడవున రోడ్లు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రహదారుల నిర్మాణానికి సంబంధించి నిధులు విడుదల చేస్తూ.. ప్రమాదరహిత రాష్ట్రంగా తయారు చేస్తున్నట్లు మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో పెట్రోకెమికల్ ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకం మినహాయింపును ఈ ఏడాది జూన్ 30 వరకు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దేశీయ పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాల సరఫరా అంతరాయం లేకుండా కొనసాగించేందుకు తాత్కాలికంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఈ మినహాయింపు వల్ల ప్లాస్టిక్, టెక్స్ టైల్, ఫార్మాస్యూటికల్ వంటి రంగాలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపింది. తద్వారా వి నియోగదారులపై అదనపు పన్నుల నుంచి మినహాయింపు కలుగుతుందని పేర్కొంది.

---------------------------

వచ్చే సంవత్సరం జూన్‌లో నిర్వహించనున్న గోదావరి మహా పుష్కరాల్లో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఉమ్మడి కార్యాచరణ బృందాలు ఏర్పాటు చేసుకోవాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్-(డీజీపీ) హరీష్‌కుమార్ గుప్తా సూచించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఐజీ అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, ఏలూరు జిల్లాల ఎస్పీలతో కలిసి ఆయన రాజమహేంద్రవరంలోని ఎస్పీ కార్యాలయంలో నిన్న సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. ప్రధానంగా రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కృత్రిమ మేధ ఆధారిత ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని చెప్పారు. పుణ్యస్నానాలకు వచ్చే భక్తుల రద్దీ నియంత్రణకు రాజమహేంద్రవరం, కొవ్వూరు, ఇతర ప్రాంతాల్లో వీలైనన్ని ఎక్కువ సూచిక పట్టీలను ఏర్పాటు చేయాలన్నారు.

---------------------------

దేశంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేయాలనే లక్ష్యంతో తీసుకువచ్చిన జన్ విశ్వాస్ బిల్లు -- 2026 కు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఈ బిల్లుతో చిన్నపాటి తప్పులు, సాంకేతిక ఉల్లంఘనలపై జైలు శిక్షల బదులు పౌర జరిమానాలు విధించే విధానాన్ని ప్రవేశపెట్టారు. నేర తీవ్రతకు అనుగుణంగా శిక్షలను హేతుబద్ధం చేస్తూ, అవసరం లేని శిక్షా నిబంధనలను తొలగించారు. మొత్తం 23 మంత్రిత్వ శాఖలకు చెందిన 79 కేంద్ర చట్టాల్లోని 784 నిబంధనలను సవరించగా, అందులో 717 నిబంధనలను నేరాల జాబితా నుంచి తొలగించారు. మొదటిసారి తప్పు చేసిన సంస్థలకు ముందుగా హెచ్చరిక ఇవ్వడం, తర్వాత మాత్రమే జరిమానా విధించడం వంటి సడలింపులు కల్పించారు. అలాగే కేసులు కోర్టులకు వెళ్ళే పని లేకుండా ప్రత్యేక అధికారులు, అప్పీల్ వ్యవస్థ ద్వారా వేగంగా పరిష్కరించే విధానం కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

---------------------------

అనంతపురం జిల్లా కేంద్రంలోని జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం 15వ స్నాతకోత్సవ కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈరోజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న కళాశాలల్లో డిగ్రీ, పి.హెచ్.డి కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు గవర్నర్ పట్టాలను ప్రదానం చేశారు. అదేవిధంగా వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 45 మందికి బంగారు పతకాలను అందజేశారు.

---------------------------

విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ హామీ ఇచ్చారు. బొబ్బిలి పట్టణంలో ఆయన నిన్న పర్యటించారు. ఈ సందర్భంగా రాణి మల్లమ్మదేవి పార్కును ఆయన సందర్శించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. బొబ్బిలి బైపాస్ రోడ్డుకు 2 కోట్ల రూపాయలు, పట్టణంలో రహదారుల నిర్మాణానికి కోటి రూపాయలు, మల్లమ్మదేవి పార్కు అభివృద్ధికి 50 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. 123 కోట్ల రూపాయలతో మంజూరైన తాగునీటి పథకం నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామని, డ్రైనేజీ అభివృద్ధి కోసం 14 కోట్ల రూపాయల మంజూరు ప్రతిపాదనను పరిశీలిస్తామని మంత్రి నారాయణ తెలియజేస్తూ...

.. వాయిస్.. 30 సెకన్లు

---------------------------

బాపట్ల జిల్లా, వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం, సూరేపల్లె గ్రామంలో ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటిస్తారని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్, ఎస్పీ బి.ఉమామహేశ్వరరావు ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన వేదిక, హెలిప్యాడ్, భద్రత తదితర అంశాలపై అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ – ఐపీఎల్ 2026లో భాగంగా కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ ఈరోజు జరగనుంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ క్రికెట్ స్టేడియంలో రాత్రి ఏడు గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. నిన్న జరిగిన రెండు మ్యాచ్ లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ పై లక్నో సూపర్ జెయింట్స్ అయిదు వికెట్ల తేడాతో గెలిచింది. మరో మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 43 పరుగుల తేడాతో విజయం సాధించింది.

---------------------------

బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిల్లా స్థాయి బడ్జెట్ సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఇంచార్జి మంత్రి కొలుసు పార్థసారథి, బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్, చీరాల శాసనసభ్యులు కొండయ్య, బాపట్ల శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు హాజరయ్యారు.

======================